క్లుప్తంగా

గ్రామాల్లో చెత్త నిల్వ లేకుండా చూడాలి

దక్కిలి: గ్రామాల్లో చెత్త నిల్వ లేకుండా ఏ రోజు కారోజు పరిశుభ్రంగా ఉండేలా క్లాప్ మిత్రలు పని చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ తెలిపారు. మండలంలోని లింగసముద్రం, చాకలపల్లి గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న క్లాప్ మిత్రలు ఇంటింటా చెత్త సేకరించడం, వీధుల్లో చెత్త నిల్వ లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

సొసైటీ త్రీమాన్ కమిటీ బాధ్యతల స్వీకరణ


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దారా అంకయ్య

ఓజిలి: సహకార సంఘం పరిధిలోని రైతులకు విరివిగా రుణాలు, ఎరువులు అందజేస్తామని సహకార సంఘం త్రీమాన్ కమిటీ చైర్మన్ దారా అంకయ్య పేర్కొన్నారు. కురుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం నూతన త్రీమాన్ కమిటీ చైర్మన్ దారా అంకయ్య, డైరెక్టర్లు అలిమిలి మల్లికార్జునరెడ్డి, కొండూరు రవీంద్రరాజు బాధ్యతలు స్వీకరించారు. సీఈఓ రవీంద్రయ్య సభ్యులతో సంతకాలు చేయించి ప్రత్యేక అధికారి నుంచి బాధ్యతలను అప్పగించారు. పలువురు చైర్మన్, డైరెక్టర్లను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేషయ్య, ఫ్రాంక్లిన్, కిష్టయ్య, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకుల కృష్ణా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గూడూరు ఏరియా హాస్పిటల్, ఏపీ వైద్య విధానం పరిషత్ బ్లడ్ సెంటర్ వారి సహకారంతో కళాశాలలోని ఎన్ఎస్ఎస్ బృందం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు 60 యూనిట్లు రక్తదానం చేశారు.

స్వామిత్ర సర్వేను వేగవంతం చేయాలి


స్వామిత్రపై శిక్షణ ఇస్తున్న డీడీఓ వాణిరెడ్డి

చిట్టమూరు/వాకాడు: మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో స్వామిత్ర సర్వేను వేగవంతం చేయాలని గూడూరు డివిజనల్ అభివృద్ధి అధికారిణి వాణిరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. చిట్టమూరు, వాకాడు మండల పరిషత్ కార్యాలయాల్లో బుధవారం స్వామిత్ర సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు డీడీఓ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్వామిత్ర ద్వారా ఇంటి స్థలాలను సర్వే చేసి ఆ ప్రదేశంలో ఇల్లు నిర్మించుకుని ఉన్న వారికి ప్రాపర్టీ కార్డులు అందజేస్తారన్నారు. అనంతరం స్వర్ణ పంచాయతీలు, పారిశుధ్యంపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి పైపులు మరమ్మతులకు గురై ఉంటే వెంటనే మరమ్మతులు చేసి తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు మనోహర్ గౌడ్, డిప్యూటీ ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, శ్రీనివాసులు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర


పొంగళ్లతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

తడ: గ్రామ దేవత పోలేరమ్మ జాతర మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ఉదయం గంగ మిట్ట వద్ద అమ్మణ్ణికి అంబళ్లు సమర్పించారు. గ్రామంలో మరో దేవత చెల్లాతమ్మకు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. రాత్రి పోలేరమ్మ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, బాణసంచా వేడుకల కోలాహలంతో పండుగ శోభ సంతరించుకుంది.

చికెన్ ధరలు		14.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	120
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	220
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	244
లేయర్ చికెన్	:	200

ప్రకృతి వ్యవసాయం.. జీవామృతం

- గోమయంతో ఘన జీవామృతం తయారీ
- చీడపీడల నివారణకు గోమూత్రం
- సహజ పద్ధతిలో వరి, నిమ్మ, కూరగాయల సాగు


చిలమానుచేనులో ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి: ఎన్నో ఏళ్ల నుంచి పురుగు మందులు లేకపోతే వ్యవసాయం చేయలేం అన్న రోజుల నుంచి క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు పడుతున్నాయి. పెద్దల కాలంలో పురుగు మందులు బదులుగా ప్రకృతిలో లభించే కషాయాలు తయారు చేస్తూ వ్యవసాయం చేస్తున్నారు. ఈ ప్రకృతి వ్యవసాయానికి ఫుల్‌స్టాప్ పెట్టి ప్రస్తుత తరం ప్రజలు క్రిమిసంహారక మందులతో వ్యవసాయం అధికంగా చేస్తున్నారు. పురుగుమందులతో కలిగే ప్రమాదాలు, ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలియజేస్తున్నారు. రసాయన ఎరువులకు బదులుగా పశువులు పేడ, ఆవుల మూత్రం, ఆకులు, అలుములతో కూడిన కషాయాలను తయారు చేస్తూ వరి, మిరప పంటల్లో చీడపీడలను నివారిస్తూ రైతులతో చైతన్యం కల్గిస్తున్నారు. మండల పరిధిలోని చిలమానుచేను, ఇనుగుంట, బట్లకనుపూరు, కొండవల్లిపాడు, ఆర్మేనిపాడు గ్రామాల్లో రైతులు సుస్థిర వ్యవసాయంపై మెలకువలు పొందుతూ సాగు చేస్తున్నారు.

సుస్థిర వ్యవసాయం

వ్యవసాయ రంగంలో అధికారులు ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారు. సహజ సిద్ధ వ్యవసాయం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గ్రామాల్లో రసాయన, క్రిమిసంహారక మందుల వాడకం నివారించి ఆకులు అలుములతో కూడిన కషాయాలు వినియోగాన్ని వాడుకలోకి తీసుకొచ్చేందుకు గ్రామ స్థాయి రైతులతో ప్రయోగాలు చేయిస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు పొందేందుకు సూచనలు అందిస్తున్నారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ అధికారులు మండలంలో 50 మంది రైతులను చైతన్యపరిచారు. ప్రకృతి వ్యవసాయం చేసేలా చర్యలు తీసుకున్నారు. వీరితో గ్రామాల్లో రైతులను చైతన్యపరిచి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెరిగేలా చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తమ గ్రామంలో చేసిన వ్యవసాయాన్ని రైతులకు చూపి వారు కూడా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

రైతుల వివరాలు

పంట పేరు	రైతుల సంఖ్య	విస్తీర్ణం
వరి	841	1199
నిమ్మ	1850	1851
కూరగాయలు	200	101

రైతుల మనసులు చూరగొనేలా..

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారంతో రైతులు ముందుకొచ్చి ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తున్నారు. కషాయాలపై రైతులకు అవగాహన కల్పించి పంటల సాగు చేపట్టారు. గ్రామాల్లో సుస్థిర వ్యవసాయం మొదటి సారి కావడంతో రైతులు ఆందోళన చెందుతుండడంతో కొద్దిపాటి నేలలో సాగు చేస్తున్నారు. మిరప, నిమ్మ పంటలపై కూడా కషాయాలు వాడకం మొదలుపెట్టారు. పశువులు, ఆవులు మూత్రం, పేడ, ఆకులతో కూడిన ఎరువులు, కషాయాలు తయారు చేసి మొదటి మెట్టును రైతులు అధిరోహిస్తున్నారు. కషాయాల వాడకంతో కలిగి ప్రయోజనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగంతో వచ్చే ప్రభావాలను వివరిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకంతో ఇంత ప్రమాదం ఉందని రైతులు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. ఈ కషాయాలను రైతులు స్థానికంగా సిబ్బంది ఏర్పాటు చేసిన దుకాణాల్లో విక్రయిస్తున్నారు. రైతులు వీటిని తీసుకెళ్లి పంట పొలాల్లో వినియోగిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం కలుగుతుంది. రసాయన ఎరువులకు బదులు ఘనజీవామృతం వినియోగిస్తున్నారు. ఆవు మూత్రం, ఆకుల వ్యర్థాలతో పిచికారీ మందులను తయారు చేస్తున్నారు. వేపాకులతో కూడిన మిశ్రమంతో తయారు చేస్తున్నారు. అగ్నిఅస్త్రం తయారీ చేసి ఆకుముడత, కాండం, వేరు తొలిచే పురుగుల నివారణకు వాడుతున్నారు. బ్రహ్మాస్త్రం కషాయాన్ని చిన్న, పెద్ద పురుగుల నివారణకు వినియోగిస్తారు. వావిలాకు కషాయం పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగు, లద్దెపురుగు, ఆకుపచ్చ పురుగు, ఆకులు తొలిచే పురుగులను నివారించవచ్చు. మరి కొన్ని తెగుళ్లకు పల్లటి మజ్జిగను వినియోగిస్తున్నారు. ఇంకా పశువుల పేడ, మూత్రం, పంచగవ్య వంటి వాటితో పంటలను సాగు చేయడం మొదలుపెట్టారు.


భట్లకనుపూరులో నవధాన్యాల సాగుపై అవగాహన, ఆర్మేనిపాడులో ద్రవజీవామృతం తయారీపై శిక్షణ, మండల కార్యాలయం వద్ద కూరగాయల విక్రయం, పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడలిలో త్రయాహ్నిక ప్రతిష్ఠ మహోత్సవం

కోట: మండలంలోని గూడలిలో శ్రీకామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం త్రయాహ్నిక ప్రతిష్ఠ మహోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో కామాక్షీదేవి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, శ్రీవారాహి, రాజేశ్వరిదేవి సహిత శ్రీచక్ర నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదపండితులు వేదపారాయణం, గోపూజ, అమ్మవార్ల ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులచే కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

అన్నదానం

వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్నారు. వేదపండితులు ఆయన్ను సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పార్టీ నాయకులు షనీల్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, సత్యానారాయణ, విజయసారథి రెడ్డి పాల్గొన్నారు.


సంగమేశ్వర స్వామి దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

500 అడుగుల జెండాతో ర్యాలీ

నాయుడుపేటటౌన్: హర్ ఘర్‌గా తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయాలని కమిషనర్ షేక్ ఫుజులుల్లా పిలుపునిచ్చారు. మున్సిపల్ సచివాలయాల ఉద్యోగులు, మెప్మా ఆర్పీలు, పొదుపు మహిళలతో తదితరులతో కలిసి బుధవారం 500 అడుగుల జాతీయ జెండాతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ పార్కు నుంచి బజారు వీధులు, గడియారం సెంటర్ మీదుగా ప్రధాన వీధుల్లో భారీ జాతీయ జెండా ర్యాలీ సాగింది. కమిషనర్ మాట్లాడుతూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను రెపరెపలాడించి దేశభక్తిని చాటి చెప్పాలని కోరారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలు, రూరల్ పరిధిలోని 11 సచివాలయాలతో పాటు ప్రతి ఇంటి వద్ద స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ జెండాను ఎగురవేయాలని ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు.



తిరంగా ర్యాలీలో కమిషనర్

నాచు మొక్కల పెంపకంపై శిక్షణ


మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ రాజేష్

వాకాడు: మండలంలోని కొండూరుపాళెం గ్రామంలో బుధవారం సముద్రపు నాచు మొక్కల పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మత్స్యశాఖ ఏడీ రాజేష్ పాల్గొని మత్స్యకారులు వేటతోపాటు ప్రత్యామ్నాయ జీవనోపాధిపై దృష్టి పెట్టాలని సూచించారు. సముద్రపు నాచు మొక్కల పెంపకం ద్వారా వివిధ జీవరాశులకు ఆవాసం ఏర్పాటవుతుందన్నారు. దీంతోపాటు కార్బన్ డయాక్సైడ్ వాయువును ఎక్కువగా గ్రహించుకుని భూమిని వేడెక్కకుండా నివారించి వివిధ విపత్తుల నుంచి కాపాడుతుందన్నారు. ఈ సముద్ర నాచు పెంపకం కింద 50 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. జీసీఎఫ్, యుఎన్‌డీపీ, జీఓఏపీ పథకం కింద కొండూరుపాళెం, అంజలాపురం సముద్ర తీర గ్రామాలను గుర్తించినట్లు వివరించారు. అనంతరం సముద్రపు నాచు పెంపకంపై కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రెడ్డినాయక్, జశ్వంత్, ప్రసన్న, అంకయ్య, రామయ్య, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

గురివింద గింజలతో అష్టోత్తర పూజ


అమ్మవారికి పూజ చేస్తున్న మహిళలు


చిల్లకూరు : గూడూరు పట్టణంలోని బజారు వీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళలు అమ్మవారికి గురివింద గింజలతో అష్టోత్తర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గణపతి పూజ చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని చిన్న మండపంలో ఉంచి అమ్మవారికి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చెందిన వాసవీ మహిళా సమాజం ఆధ్వర్యంలో సుమారు 100 మంది మహిళలు అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూజా విధానం చెప్పి వారితో గురివింద గింజల పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు. శ్రావణ మాసంలో ప్రతి మంగళవారం, శుక్రవారం, ఆదివారంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేలా రూపొందించినట్లు వాసవీ మహిళా సమాజ సభ్యులు తెలిపారు.

ఘనంగా మహా సంప్రోక్షణ

చిల్లకూరు : మండల తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో నూతనంగా నిర్మించిన రుణవిమోచన శ్రీ కృష్ణమందిరం మహా సంప్రోక్షణ కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మ వెలసిన ప్రాంతంలో నూతనంగా కృష్ణ మందిరం నిర్మించడంతో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గూడలి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దాతలు మిద్దె నాగయ్య, శ్రీదేవి, యశ్వంత్ నిర్మించిన ఆలయంలో కృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గోపూజ, రక్షాబంధనం, పూర్ణాహుతి, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దాత మిద్దె నాగయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో హిందూ ధర్మాన్ని ప్రచారం చేయాలనే సంకల్పంతో రుణ విమోచన శ్రీ కృష్ణ మందిరం నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, ముత్యాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, చెన్నైకి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.


స్వామి వారి సన్నిధిలో దాతలు, ప్రత్యేక ఆహ్వానితులు

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ వితరణ


పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ వద్ద దాతలు

పెళ్లకూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుధవారం కంప్యూటర్ ఏ1 ల్యాబ్‌ను ఎస్ఆర్‌ఐ పేరం వెంకట్ తేజ పుట్టిన రోజు సందర్భంగా సొంత నిధులతో ప్రారంభించారు. కంప్యూటర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ1)అప్లికేషన్లు అందుబాటులో ఉంటాయని తద్వారా విద్యార్థులు ఆధునిక జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని వెల్లడించారు. వారానికి రెండు రోజులు కంప్యూటర్ తరగతుల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్ ఉపాధ్యాయుడిని నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతులకు ఉద్యానవన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని ఉపాధి ఏపీఓ గిరిబాబు సూచించారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమకు ఉన్న ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాలతో నమోదు చేసుకుంటే వారికి రాయితీపై పండ్ల మొక్కలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ పండ్ల మొక్కల సంరక్షణ కింద మూడేళ్లు నగదు చెల్లించనున్నట్లు వివరించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

నాయుడుపేటటౌన్: కారు బైక్‌ను ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, మండల పరిధిలోని అన్నమేడు గ్రామానికి చెందిన వెంకయ్య బైక్‌లో నాయుడుపేటలో మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో వెంకయ్యతో సినీఫక్కీలో గాల్లోకి లేచి అక్కడి డివైడర్‌పై పడ్డారు. వెంకయ్య తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయన్ను స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలేరమ్మ ఆలయ చైర్మన్‌గా నానాబాల


నానాబాల సుబ్బారావు

నాయుడుపేటటౌన్: స్థానిక గ్రామ దేవత పోలేరమ్మ ఆలయ చైర్మన్‌గా నానాబాల సుబ్బారావు నియామకం చేసినట్లు దేవదాయ శాఖ నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ట్రస్టీ సభ్యులుగా ఆబోతులు బాబు, వినుకొండ మంజుల, పొళెంసాయి శిరీష, రావూరు హైమావతి, పోంగూరు నారోత్తమ రెడ్డి, కే సురేష్, బచ్చి సుబ్బలక్ష్మమ్మ, ఏవీ సుబ్బ రవీంద్ర, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకులు ఆర్ ముని సురేష్‌ను నియమించినట్లు ప్రకటించారు.

రోడ్డుపైనే ఇరుక్కున్న లారీ

కలువాయి(సైదాపురం): మండలంలోని వెంకటరెడ్డిపల్లి సర్కిల్ వద్ద భారీ లారీలు తరచూ రోడ్డుపై ఉన్న గుంతలో ఇరుక్కుపోతున్నాయి. ఇటీవల భారీ వాహనాలు రెండు రోజులకోసారి ఇరుక్కు పోతున్నా, ఆర్అండ్‌బి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. కలువాయి నుండి సోమశిల వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపైనే పెద్ద గుంతలు ఉండడంతో వాటిలో ఇరుక్కుపోతున్నాయి.



వరిలో యాజమాన్య పద్ధతులు


వర్షాలకు దెబ్బతిన్న వరిపైర్లను పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు: రబీ సీజన్‌లో వరిసాగు చేపట్టే రైతులందరూ యాజమాన్య పద్ధతులు అనుసరించాలని, తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా కేంద్ర వనరుల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. చిల్లకూరు గ్రామంలో బుధవారం యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా కాలిబాటలు, నత్రజని ఎరువులు, పొటాష్ ఎరువులు వాడకం, సీజన్ డ్రైనేజ్ పాటించడం వల్ల పంట ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు పొందవచ్చని వెల్లడించారు. అనంతరం వర్షాలకు నేలవాలిన వరిపైరును పరిశీలించి పంట నష్టాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు నేదురుమల్లి రాక

వెంకటగిరి (సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పట్టణంలోని తన నివాసంలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాల నుంచి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

నాయుడుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యం అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు చిందేటి వెంకటేశ్వర్లును బుధవారం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి పరామర్శించారు.

ఎఫ్ఏ-1 పరీక్షల పరిశీలన


దగ్గవోలు జెడ్పీ హైస్కూల్ ఎఫ్ఏ-1 పరీక్షలను సందర్శిస్తున్న ఎంఈఓ

దక్కిలి: మండలంలోని కమ్మవారిపల్లి (పాతనాలపాడు), దగ్గవోలు జెడ్పీ హైస్కూల్లో 6 నుంచి 10వ తరగతి వరకు జరుగుతున్న ఎఫ్ఏ-1, (అసెస్‌మెంట్) పరీక్షలను బుధవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. పలువురు విద్యార్థుల పరీక్ష పత్రాలను పరిశీలించారు. పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులు మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. దగ్గవోలు మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారంతో నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

నేడు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

సూళ్లూరుపేట : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేట పట్టణంలోని హోలీక్రాస్ సర్కిల్ నుంచి షార్ వై జంక్షన్ వరకు గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించనున్నట్లు కమిషనర్ చిన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి పాల్గొంటున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ అధికార యంత్రాంగమంతా కూడా పాల్గొనాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోట: స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు చేపట్టారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.